

## కేసీఆర్‌తోనే రైతులకు స్వర్ణయుగం

**ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు**

**దీక్షను విజయవంతం చేయాలి : మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్**

డోర్నకల్, ఏప్రిల్ 5 : కేసీఆర్‌తోనే రైతులకు స్వర్ణయుగమని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గడిచిన పదేళ్లలో కేసీఆర్ రైతును రాజు చేశారని, వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు రైతుబంధు, సమయానికి విత్తనాలు, ఎరువులు అందించారని అన్నారు. మే, జూన్ నెలల్లో 45, 50 అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు కూడా ప్రజలెవరూ నీళ్ల కోసం బిందెలు పట్టుకుని బయటికి రాలేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ రైతులకు కరువు తెచ్చిందన్నారు. రైతుల పంట పొలాలు నీళ్లు లేక ఎండిపోతున్నాయని అన్నారు. రాజకీయాలు ఎన్నికలప్పుడే చేయాలని, రైతుల జీవితాలతో ఆడుకోవద్దన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం రెండు వేల మంది రైతులతో డోర్నకల్ నియోజకవర్గ కేంద్రంలో ఒక్క రోజు దీక్ష చేయనున్నట్లు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గాలికి వదిలి, ఇతర పార్టీల నాయకులను చేర్చుకుంటున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రేవంత్‌రెడ్డిని అనవసరంగా గెలిపించామని ప్రజలు, రైతులు బాధపడుతున్నట్లు తెలిపారు. మూడెకరాల వరకు కూడా రైతుబంధు పడలేదని, రైతులకు రూ. 2లక్షలు రుణమాఫీ చేయలేదన్నారు. రైతులకు ఎకరానికి రూ.500 బోనస్ ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. రైతులకు బోనస్ ఇవ్వాలని జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రం అందజేశామన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. చాలామంది సొంత రాజకీయాలు, స్వ ప్రయోజనాల కోసం పార్టీ మారుతున్నట్లు తెలిపారు. పార్టీలు మారే వారికి త్వరలోనే ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. పార్టీలు మారిన నాయకులతో బీఆర్ఎస్ పార్టీకి నష్టమేమీ లేదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మహబూబాబాద్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుస్తుందన్నారు. కార్యకర్తలు మనోధైర్యంతో ఉండాలని, అండగా ఉండి కాపాడుకుంటామన్నారు. కేసీఆర్ బిడ్డగా ఆదరించి తనకు ఎమ్మెల్సీ, మంత్రి పదవి కట్టబెట్టినట్లు తెలిపారు. జీవితాంతం బీఆర్ఎస్ పార్టీతోనే ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కత్తెరశాల విద్యాసాగర్, కౌన్సిలర్లు తేజావత్ సంధ్యారాణి, పోటు జనార్దన్, బోరగళ్ల శరత్‌బాబు, నాయకులు మాన్యపాట్ని, తేజావత్ రమేశ్, కాలా యశోధర్‌జైన్, కొత్త వీరన్న, కొత్త రాంబాబు పాల్గొన్నారు.



డోర్నకల్: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

### కేసీఆర్ పిలుపు..

సాగునీరు లేక యాసంగి పంటలు ఎండిపోయిన నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా రైతుల వద్దకు వస్తున్నారు. మార్చి 31న జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధరావత్‌తండాలో ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతుల కష్టాలు తెలుసుకొని ధైర్యమిచ్చారు. ప్రాజెక్టుల నుంచి నీళ్లు రాకపోవడంతో బోర్లు వేసుకున్నామని, బోర్లు పడక ఇబ్బందులు పడుతున్నామని రైతులు కేసీఆర్‌తో గోడు వెళ్లబోసుకున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు అండగా నిలవాలని కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన మేరకు వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. యాసంగి వరి కోతలు మొదలైన నేపథ్యంలో ఇప్పటినుంచే బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఈ నెల 2న అన్ని జిల్లాల్లో కలెక్టర్లకు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రాలు ఇచ్చారు. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం బోనస్‌పై నిర్ణయం తీసుకోకపోవడంతో మరింత ఒత్తిడి పెంచేందుకు శనివారం రైతు దీక్షలను నిర్వహిస్తున్నది.

# రైతన్న కోసం బీఆర్ఎస్ పోరు

## బోనస్ కోసం నేడు రైతు దీక్షలు

**వరికి రూ.500 చెల్లించాలని డిమాండ్.. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు**

**పాల్గొననున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు**

*రైతన్నల కోసం బీఆర్ఎస్ మరోసారి పోరుకు సిద్ధమైంది. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వల్ల సాగునీరందక ఎండిపోయిన పంటలకు రూ.25వేల నష్టపరిహారం, యాసంగి వడ్లకు కనీస మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో రైతు దీక్షలు నిర్వహిస్తున్నది. ఈ విషయమై ఇప్పటికే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 2న కలెక్టర్లకు వినతిపత్రాలు అందించగా, తాజాగా ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు తెలుపనున్నారు. ఈమేరకు అన్ని ఏర్పాట్లు చేయగా రైతుల కోసం తలపెట్టే ఈ నిరసనల్లో ఎమ్మెల్యేలు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొననున్నారు.*

*– వరంగల్, ఏప్రిల్ 5*
*(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చేలా బీఆర్ఎస్ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణ లోపంతో యాసంగిలో పంటలకు సాగునీరు అందలేదు. వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. ప్రాజెక్టుల నుంచి కాల్వలకు సాగునీటి సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వరి రైతులు ఎక్కువ నష్టపోవాల్సి వచ్చింది. ఎండిన పంట పోగా మిగిలిన పంటకు అయినా కనీస మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తున్నది. అన్నదాతలకు అండగా నిలిచేందుకు రైతుల దీక్షలను తలపెట్టింది.







నయీంనగర్ బ్రిడ్జి కూల్చివేత పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

## నయీంనగర్ బ్రిడ్జి పనులు వర్షాకాలంలోపు పూర్తి

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 5 :వచ్చే వర్షాకాలంలోపు నయీంనగర్ బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ నయీంనగర్ బ్రిడ్జి కూల్చివేత పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమీషన్ల కోసం తాను కక్కుర్తి పడనని, వర్షాకాలం రాకముందే పనులు పూర్తి చేసేలా సహకరించాలని అధికారులకు సూచించారు. నయీంనగర్ వాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరుతోందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అజీజ్‌ఖాన్, మాజీ డిప్యూటీ మేయర్ టీ అశోక్‌రావు, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, చాడ స్వాతీరెడ్డి, వేముల శ్రీనివాస్, మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్, సీనియర్ నాయకులు బిన్ని లక్ష్మణ్, నాయిని లక్ష్మిరెడ్డి, బొమ్మతి విక్రమ్, తోట పవన్ పాల్గొన్నారు.

## చెక్‌పోస్టులు ఎత్తేశారు..

సుబేదారి, ఏప్రిల్ 5: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం కమిషనరేట్ పరిధిలోని చెక్‌పోస్టులను ఎత్తివేశారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత కమిషనరేట్ పరిధిలో 24 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అయితే, ప్రస్తుతం షెడ్యూల్ మాత్రమే రావడం, ఎన్నికలకు ఇంకా సమయం ఉండడంతో నోటిఫికేషన్ విడుదల తర్వాతనే చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇప్పటికే కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన 24 చెక్‌పోస్టులను పోలీసు అధికారులు శుక్రవారం ఎత్తివేశారు.



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

## కేఎంసీలో 'పట్టా' సంబురాలు

**ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు**



వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 5: ప్రపంచంలోనే డాక్టర్ వృత్తికి ప్రత్యేక గౌరవం ఉందని ప్రముఖ కార్డియాలజిస్ట్ కస్తూరి శ్రీధర్ అన్నారు. కాకతీయ మెడికల్ కాలేజీలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య విద్య పూర్తి చేసుకున్న 250 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తి ఆయుష్షు పెంచే శక్తి ఒక్క వైద్యులకు మాత్రమే ఉందన్నారు. కరోనా కాలంలో విద్యనభ్యసిస్తూ, కఠినమైన పరిస్థితుల్లో వైద్య సేవల్లో పాలుపంచుకున్న ఈ బ్యాచ్ విద్యార్థులు కరోనా ఫైటర్స్‌గా పేరొందారని కితాబిచ్చారు. కేఎంసీలో తాను చదివిన రోజులు, ఎంజీఎం హాస్పిటల్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. అనంతరం కేఎంసీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌లో ఆనందోత్సాహాల మధ్య విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి సెల్ఫీలు తీసుకున్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌రావు, ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆర్ఎంవో భరత్‌కుమార్ పాల్గొన్నారు.

## రంజాన్ రష్..





*రంజాన్ సమీపిస్తున్న వేళ నగరంలో సందడి నెలకొంది. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింలకు ఆఖరి శుక్రవారం కావడంతో వరంగల్‌లోని మండిబజార్ ప్రధాన రహదారి, మసీదులు కిక్కిరిశాయి. ఇఫ్తార్ విరమణ సందర్భంగా ఇటు పండ్ల దుకాణాలు కిటకిటలాడగా నోరూరించే హలీం, హరీస్ అందించే హోటళ్లు, ఇతర దుకాణాలు విద్యుత్ వెలుగుల నడుమ మెరిసిపోయాయి.*

*– వరంగల్ ఫొటోగ్రాఫర్, ఏప్రిల్ 5*

## జోరుగా.. హుషారుగా

**నిట్‌లో స్ప్రింగ్ స్ప్రీ-2024 షురూ**

**అట్టహాసంగా మూడు రోజుల కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం**

**మ్యూజికల్ షోలో దుమ్మురేపిన హరిచరణ్**

**క్రేజీ పాటలకు చిందేసిన విద్యార్థులు**

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 5 : వరంగల్ నిట్‌లో స్ప్రింగ్ స్ప్రీ-2024 వేడుకలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ సాంస్కృతిక మహోత్సవం విద్యార్థుల్లో హుషారు నింపింది. ఈ నెల 7 వరకు కొనసాగనుండగా దేశ నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులతో క్యాంపస్ సందడిగా మారింది. విద్యార్థులు పోటీపడి ప్రదర్శించిన ఈవెంట్లు వినోదంతో పాటు విజ్ఞానాన్ని పంచాయి. ఈ వేడుకలను నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏకతాటిపైకి తీసుకొచ్చినందుకు మొత్తం బృందాన్ని అభినందించారు. విద్యార్థులకు సంపూర్ణ అభ్యాసం అవసరమని, ఇలాంటి ఈవెంట్లు వారి అభివృద్ధికి దోహదపడుతాయన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డీ శ్రీనివాసాచార్య మాట్లాడుతూ 40కి పైగా ఈవెంట్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ప్రెసిడెంట్ హరికృష్ణ, కల్చరల్ వైస్ ప్రెసిడెంట్ సతీశ్ బెన్, సాహిత్, తనీశ్, ప్రశాంత్, చందర్ కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు. తాడూరి రేణుక, శిష్యులు కూచిపూడి నాట్యం ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ క్లబ్ నిర్వహించింది. సాయంత్రం 4గంటల తర్వాత అన్‌సాల్వ్, నుక్కడ్ నాటక్, నిట్ గాట్ టాలెంట్, ఫిల్మ్ ట్రెజర్ హంట్, ఫిల్మ్ క్విజ్, కొరియో నైట్, ఫుడ్ హంట్ ఈవెంట్లు పోటాపోటీగా సాగాయి. హరిచరణ్ మ్యూజికల్ నైట్ షో విద్యార్థుల్లో ఫుల్ జోష్ నింపింది. ప్రోషోలో భాగంగా ప్రముఖ గాయకుల పాటలకు విద్యార్థులు ఉర్రూతలూగారు.



జ్యోతిప్రజ్వలన చేసి స్ప్రింగ్‌స్ప్రీ వేడుకలను ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి







'నుక్కడ్ నాటక్' ఈవెంట్‌లో విద్యార్థులు